క్లుప్తంగా

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న ఈవో

జన్నారం: ఎక్కడ పడితే.. అక్కడ చెత్త పడేస్తే జరిమానా విధించనున్నట్లు పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ ఈవో రాహుల్ తెలిపారు. పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కూడళ్ల వద్ద ఆదివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో చెత్త పారేస్తే పారేసిన వారికి రూ.1000జరిమానా విధిస్తామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అందరు సహకరించాలని కోరారు.

ఘనంగా వెంకటస్వామి వర్ధంతి



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవేణు, కోశాధికారి కిరణ్, సభ్యులు బారిక్‌రావు, వాహిద్ అలీ, రాములు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరగకముందే పట్టించుకోండి..!



మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్డుపై ఉన్న గుంత ప్రమాదకరంగా మారుతోంది. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ కోసం తవ్విన చోట గుంత ఏర్పడగా, అది రోడ్డులోనే ఉండడంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా మారింది. ఆరు ఫీట్ల లోతుకు పైగా ఉన్న ఈ గుంత వల్ల ఎలాంటి ప్రమాదం ఏర్పడక ముందే దానిని మూసేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



హోలీ వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో ఆదివారం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో సహజ సిద్ధమైన రంగులతో అధ్యాపకులు, విద్యార్థులు హోలీ వేడుకలను ఆనందోత్సవాల్లో మునిగితేలారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా అధికారి చంద్రమోహన్‌గౌడ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్‌లు షరీనా బేగం, వంశీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెరిగిన నిఘా..!

చెన్నూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియామవళిని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఫ్లెయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ప్రత్యేక బృందాలు కొరఢా ఝులిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ను నిర్లక్ష్యం చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాల్సిందేనని స్థానిక సీఐ రవీందర్ హెచ్చరిస్తున్నారు. కోడ్‌ను ఉల్లంఘించి చెన్నూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న శుక్రవారం రోజున పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మద్దెల భవాని ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మహిళలు అనుమతి లేకుండా ధర్నా చేయడంతో ఎస్‌ఎఫ్‌టీ బృందాలు ధర్నాను వీడియోలో చిత్రీకరించి సదరు మహిళా నాయకురాళ్ల పై కేసు నమోదు చేశారు. అనంతరం తహసీల్దార్ ఎదుట రూ.5లక్షల పూచికత్తుపై బైండోవర్ చేశారు.

తీరనున్న కష్టాలు..!



పెగడపల్లి వాగుపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి

- వంతెన నిర్మాణంతో 20గ్రామాలకు రవాణా మెరుగు

జైపూర్: వర్షాకాలం వస్తే చాలు బాహ్య ప్రపంచానికి దూరంగా అనేక పల్లెలు జీవనం గడపాల్సిన పరిస్థితి. చిన్న వానకు సైతం వాగులు ఉప్పొంగి ప్రవహించడం, వాగులపై లోలేవల్ వంతెనలతో దశాబ్దాల కాలంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. అత్యవసర సమయంలో సైతం అంబులెన్స్ వాగు దాటని దయనీయ స్థితిలో సుమారు 20గ్రామాలకు కీలకంగా మారిన పెగడపల్లి ఈదులాగుపై బ్రిడ్జి నిర్మాణంతో ఇక ప్రజల కష్టాలు తొలగనున్నాయి. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పెగడపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

– జైపూర్ మండలం పెగడపల్లి ఈదులాగుపై సింగరేణి నాన్‌ప్లాంట్ రూ.2.6కోట్ల నిధులతో నూతనంగా బ్రిడ్జి నిర్మిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఆ నాటి ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పవర్‌ప్లాంట్ పక్కనే ఉన్నా పెగడపల్లి బ్రిడ్జి నిర్మాణంపై పాలకులు పెద్దగా దృష్టి పెట్టకపోవడం ఏటా వర్షాకాలం పెగడపల్లి నుంచి మొదలుకుని గంగిపల్లి, షెట్‌పల్లి నర్సింగాపూర్, బెజ్జాల, మద్దులపల్లి, కుందారం, కిష్టాపూర్, పొనూర్, వేలాల, శివ్వారం మీదుగా చెన్నూర్ మండలానికి వెళ్లే సుమారు 20గ్రామాల ప్రజల రవాణాకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఆరేళ్ల కిందట సింగరేణి సీఎస్సార్ నిధులు మంజూరైనప్పటికీ టెండర్ల దశలోనే ఏళ్లు గడవడం కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి బ్రిడ్జిల నిర్మాణాలపై దృష్టి పెట్టడంతో నిర్మాణ పనులు చకచకా ముందుకుసాగుతున్నాయి. కేవలం మూడు నెలల్లోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో ఏడాది వానాకాలం కల్లా బ్రిడ్జి పూర్తికావస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకోగా రెండువైపులా అప్రోచ్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. పవర్‌ప్లాంట్‌లో అనేక మంది కార్మికులు పనిచేస్తుండగా ఎక్కువ శాతం పెగడపల్లి, గంగిపల్లి, ఎల్కంటి, షెట్‌పల్లి, టేకుమట్ల వాసులు ఉండగా వర్షకాలంలో వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుండగా వారికి రవాణా కష్టాలు తొలగనుండగా 20గ్రామాలకు పై రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

కష్టాలు తొలగనున్నాయి..



ఏళ్లుగా పెగడపల్లి ఈదులాగు బ్రిడ్జి కోసం అధికారులు దృష్టి పెట్టలేదు. గతేడాదే నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో అనేక గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తొలగిపోనున్నాయి. ఈ ఏడాది వానాకాలం కల్లా బ్రిడ్జి పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి (భూనిర్వాసిత నాయకులు పెగడపల్లి)

వర్షాకాలం వస్తే వాగు దాటని పరిస్థితి..



వర్షాకాలం వస్తే వాగు ఉప్పొంగి ప్రవహించడం.. ఒక్కోసారి రెండు మూడు రోజులు వాగు దాటని పరిస్థితి ఉండేది. అత్యవసర సమయంలో అంబులెన్స్ సైతం రాక లేక ఇబ్బందులు పడ్డాం. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో మాకు రవాణా సౌకర్యం కలగనుంది.

– పత్తి మధు(పెగడపల్లి వాసి)

ఆపదలో దంపతులు..!

- ప్రమాదంలో తీవ్రంగా గాయాలు
- మంచానికే పరిమితం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



గాయాలతో హోంగార్డు ధర్మయ్య, భార్య కళావతి

వేమనపల్లి: అతడు పోలీసు శాఖలో 19సంవత్సరాలు ఉత్తమ హోంగార్డుగా, ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా పని చేశారు. ఆ కుటుంబాన్ని చూసి విధి వెక్కిరించింది. రోడ్డు ప్రమాదం రూపంలో కుటుంబాన్ని కకావికలం చేసింది. ఇద్దరు సాయం చేయండి అని.. నోటి మాటరాని స్థితిలో గాయాలతో జీవచ్ఛవంలా మంచానికే అతుక్కుపోయారు. కదిలిస్తే కన్నీటి ధారలై కారుతున్న హోంగార్డు దుర్గం ధర్మయ్య, అంగన్‌వాడీ టీచర్ కళావతి ఆవేదన. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని జాజులపేట గ్రామానికి చెందిన దుర్గం ధర్మయ్య 19సంవత్సరాల నుంచి ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. భార్య కళావతి జాజులపేటలో అంగన్‌వాడీ టీచర్. వీరికి ఐదుగురు పిల్లలు. ఫిబ్రవరి 11వ తేదీన భార్యాభర్తలిద్దరు బైక్‌పై లక్సెట్టిపేటకు వెళ్తుండగా జైపూర్ అటవీ ప్రాంతంలో రాంగ్‌రూట్‌లో అతివేగంతో వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలిద్దరి తలలకు బలమైన గాయాలయ్యాయి. ధర్మయ్య భుజం, ఎడమకాలు పాదంపైన ఎముకలు విరిగిపోయాయి. ఊపిరితిత్తుల్లోకి పక్కటెముకలు గుచ్చుకొని రక్తం, నీరు ఊపిరితిత్తుల్లో నిండిపోయాయి.

కోమాలో 14 రోజులు..

ప్రమాదం జరిగిన నాటి నుంచి 14రోజులు ధర్మయ్య కోమాలో ఉండిపోయాడు. సహచర హోంగార్డులు ఉన్నతాధికారుల సహకారంతో ఉన్నత వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ప్రాణాలకు భరోసా ఇవ్వలేమన్న వైద్యులు శరీరమంతా గాయాలతో ఉన్న ధర్మయ్య, కళావతికి పోలీసు అధికారులు అండగా నిలువడంతో వైద్యం చేశారు. అందినకాడికి అప్పులు చేసి రూ.6లక్షలు ఖర్చు చేశారు. ఇద్దరు గాయాలతో లేవలేక మంచానికే పరిమితం కావడంతో పూట గడవడం కష్టంగా మారింది. వైద్యానికి డబ్బులు సరిపోక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ధర్మయ్య కుటుంబానికి పోలీసు శాఖ, కళావతి కుటుంబానికి ఐసీడీఎస్ అధికారులు అండగా నిలువాలని వేడుకుంటున్నారు. దయామయులు 94930 01242 నంబర్లకు ఫోన్ చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పెద్దంపేటలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలో 28వ తేదీ గురువారం బంగారు పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారుతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా 26వ తేదీ మంగళవారం గణపతి పూజ, కళశ, అగ్ని ప్రతిష్ఠాపన ఉత్సవాలు, 27వ తేదీ బుధవారం స్థాపితా దేవత పూజలు, హోమాలు, 28వ తేదీ గురువారం ఉదయ బంగారుతల్లి విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో గ్రామ, మండల పరిధిలోని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

'ఏజెన్సీలో పూర్తి హక్కులు ఆదివాసీలకే ఉండాలి'



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు


కాసిపేట: ఏజెన్సీ గ్రామాల్లో పూర్తిహక్కులు ఆదివాసీలకే ఉండాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య అన్నారు. మండలంలోని దేవాపూర్‌లో తుడుందెబ్బ ఆదివారం సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీలో ఇతరులు చొరబడి భూములను స్వాధీనం చేసుకుంటున్నారని అడవిని నమ్ముకొని జీవించే ఆదివాసీలకు ఆ భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టప్రకారం గ్రామాల్లో ఎటువంటి పనులు చేపట్టినా, పీసా చట్టం ఆమోదం పొందిన తరువాత చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ నియామకాల్లో ఆదివాసీ విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, మహేష్, సీతారాం, భగవంత్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చెత్త చేరి.. నీరు నిలిచి



పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని 10వ వార్డు శ్రీనివాస కాలనీలోని ఆదర్శనగర్‌లోని మురుగు నీటి కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. నీరు వెళ్లే మార్గం లేక మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. నెలల తరబడి చెత్త తొలగించకపోవడంతో చెత్తతో మురుగునీరు నిలిచి ఆ దారి వెంట వెళ్లాలంటే వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు.

మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు



భీమారం: మంచిర్యాల అటవీడివిజన్ పరిధిలోని భీమారం మండలం పోతన్‌పల్లి అటవీబీట్‌లో గత సంవత్సరం నాటిన మొక్కలకు నీళ్లు అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. అటవీశాఖ ప్రస్తుతం ఉన్న అడవిలో చెట్లు లేని ప్రాంతాలను గుర్తించి.. అక్కడ అడవి పెంపకం కోసం గ్యాప్ ఫిల్లింగ్‌పేరుతో నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఈ మేరకు పోతన్‌పల్లి బీట్‌ని గుర్తించి అక్కడ మొక్కలు నాటిన అటవీశాఖ అధికారులు.. వాటి సంరక్షణను మరిచారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ఇదే ప్రాంతంలో పెద్ద ఎత్తున చెట్లను నరికివేయడం గమనార్హం. అడవులను కాపాడాలని ఒకవైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ, లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నాటిన మొక్కలపై అటవీశాఖ నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



ప్రత్యేక గీతాన్ని ఆలపిస్తున్న మహిళలు



దండేపల్లిలో మట్టలతో క్రైస్తవులు



మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



మట్టలతో ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ భక్తులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈత, ఖర్జూర మట్టలతో జయహో యేసు క్రీస్తు అంటూ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చీల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. దండేపల్లిలో సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రెస్‌బిటర్ ఇన్‌చార్జి వరప్రసాదరావు, సంఘ పెద్దలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, ప్రమోద్, రవి, సత్యానందం పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: మట్టల ఆదివారాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో పాటు మట్టలను చేత పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రభువు తొలిసారిగా జెరుసలేం పట్టణంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి ప్రజలు ఆయనను మట్టలు, చెట్ల కొమ్మలతో ఘన స్వాగతం పలికిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పండగను ఏటా నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక సీఎస్‌ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో పాస్టర్ జాషువా దైవసందేశాన్నిచ్చారు.

మందమర్రిరూరల్: ఈస్టర్ ముందు వచ్చే ఆదివారాన్ని క్రైస్తవులు మట్టల ఆదివారంగా జరుపుకుంటారు. మందమర్రిలో చర్చీల సమీపంలో ఈత మట్టలు పట్టుకుని ఊరేగింపుగా క్రైస్తవ గీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని తెలిపారు. మానవాళి రక్షణకు ఏసుక్రీస్తు బలిదానంగా అర్పించుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు, విశ్వాసులు ఉన్నారు.

బెల్లంపల్లి: క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. రెవరెండ్ సీ.హెచ్.అశోక్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈత మట్టలు చేత పట్టుకుని పుర వీధులలో ప్రదర్శన చేశారు. క్రీస్తును ప్రార్థిస్తూ పాటలు పాడుతూ ఊరేగింపుగా సీఎస్‌ఐ చర్చికి వచ్చారు. చర్చి చుట్టూరా ప్రదక్షిణలు చేసి లోక రక్షకుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

వంతెన పనులకు వాగు ఇసుక


భీమిని: అభివృద్ధి పనుల కోసం నాణ్యమైన ఇసుక వాడాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు అందుకు భిన్నంగా స్థానిక వాగు ఇసుక వాడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. భీమిని మండలంలోని రాంపూర్ నుంచి తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న వంతెన పనుల కోసం నాసిరకం ఇసుక వాడుతున్నా, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఈ వంతెన నిర్మాణానికి అధికారులు మంచిర్యాల–ముల్కల్ల ఇసుక రీచ్ నుంచి తీసుకురావాల్సి ఉన్నప్పటికీ అక్కడ నుంచి కొంత ఇసుక తీసుకొచ్చి స్థానిక వాగులో నుంచి ఇసుక తీసుకొచ్చి కుప్పలుగా పోస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



క్రీడా ప్రాంగణాలు ఇలా.. ఆటలాడేది ఎలా?

రాసపల్లిలో...





రంగంపల్లెలో పిచ్చి మొక్కలతో...

దండేపల్లి: క్రీడా ప్రాంగణాల నిర్మాణంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ ఇష్టారీతిన వ్యవహరించారు. నిర్మాణాలు సరే, కనీసం అవి క్రీడాకారులకు ఉపయోగపడతాయా లేదా అనే ఆలోచన మాత్రం చేయలేదు. ఇవి చాలా చోట్ల నిరుపయోగమే తప్పా, ఎక్కడ కూడా వీటిని వినియోగించడం లేదు. ఎందుకంటే గ్రామాలకు దూరంగా, ఒక గ్రామానికి ఒక గ్రామం వద్ద ఎక్కడ ప్రభుత్వ స్థలం ఉంటే అక్కడ నిర్మాణం చేపట్టడం, ఓ బోర్డు పెట్టి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. దండేపల్లి మండలంలోని రంగంపల్లె క్రీడా ప్రాంగణాన్ని ఊరికి దూరంగా, గుట్ట ప్రదేశంలో నిర్మించారు. అది దూరంగా ఉండటంతో అది నిరుపయోగంగా మారింది. దీంతో అక్కడ అన్ని పిచ్చి మొక్కలు మొలిసాయి. రాసపల్లి క్రీడాప్రాంగణానికి రంగంపల్లె సమీపంలో నిర్మించారు. అయినప్పటికీ అందులో తొలగించిన గూడెం లిప్టు పైపులు పెట్టారు. అది వినియోగించుకునేలా లేదు. ఇవి రెండే కాదు. మండలంలో చాలా క్రీడా ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా అనువుగాని ప్రదేశాల్లో నిర్మించడంతో నిరుపయోగంగానే మారాయి.

పెద్దయ్య ఆలయం వద్ద సందడి



దండేపల్లి: మండల కేంద్రానికి సుమారు 10కిలో మీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో గల పెద్దయ్య ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెద్దయ్య దేవున్ని దర్శించుకుని పాడి, పంట బాగుండాలని, పంటలు మంచి దిగుబడి రావాలని కోరుతున్నారు. అనంతరం అక్కడే విందు వంటకాలు చేసుకుని భుజించారు. దీంతో పెద్దయ్య ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి.